# సడ్డిలోకం

అగస్త్యప్రగడ హేమంత

**కాలింగ్ బెల్ మోగడంతో చదువుతున్న పుస్తకం లోంచి తలెత్తి విసుగ్గా తలుపు వైపు చూసింది జయంతి. ఆమె చూపులకి భయ పడేది లేదన్నట్టుగా వెంటనే మరోసారి మోగింది కాలింగ్ బెల్.**


గుమ్మం అవతలున్న వాళ్లెవరో కానీ తను వెళ్లే వరకూ బెల్‌మీద నుంచి వేలు తియ్యరని అర్థమైంది. చేతిలో ఉన్న పుస్తకాన్ని పక్కన పడేసి ఇక తప్పదన్నట్టుగా పైకి లేచింది. తలుపు తెరిచి చూసేసరికి ఎదురుగా ఇద్దరు కుర్రాళ్లు నిలబడి ఉన్నారు. ఇద్దరికీ ఇరవైలోపే. ఒకతను ఎర్రగా సన్నగా పొడుగ్గా ఉంటే, రెండో కుర్రాడు లావుగా పొట్టిగా నల్లగా ఉన్నాడు. ఇద్దరినీ చూడగానే కాలేజీ స్టూడెంట్స్ అని తెలియకనే తెలుస్తోంది.

"ఏం కావాలి ?" భ్రుకుటి ముడేసి అడిగింది జయంతి.

"రూమ్.. రూమ్ కావాలి" ఠక్కున అన్నాడు ఇద్దర్లో మొదటి కుర్రాడు.

"ఇక్కడ రూమ్ లేవీ లేవు.... అయినా బయట టులెట్" బోర్డ్ లేదుగా.. ఎందుకొచ్చారు ?" విసురుగా అడిగింది.

వేళగాని వేళలో వచ్చి వాళ్ళు తననలా డిస్టర్బ్ చెయ్యడం ఆమెకి నచ్చలేదు. అదీకాక తను పుస్తకం



పట్టుకున్నప్పుడు ఇప్పుడావిసుగునే ఆమె వాళ్ల మీద ప్రదర్శిస్తోంది.

"సారీ ఆంటీ.. బోర్డ్ లేక పోయినా .. అడిగితే ఫలితం ఉండక పోతుందా అని ధైర్యం చేసి వచ్చాం." వాళ్లలో ఉన్న రెండో కుర్రాడు అన్నాడు.

"చెప్తున్నాను కదా ! ఇక్కడ రూము లేవీ ఖాళీగా లేవని. ఉన్న ఈ లంకంత కొంప మాకే సరిపోదు." చెప్పేసి వాళ్ళ ముఖం మీదే తలుపు వెయ్యబోయింది. చటుక్కున చెయ్యి అడ్డు పెట్టి ఆమె తలుపు వెయ్యకుండా ఆపాడు మొదటి కుర్రాడు. ఊహించని విధంగా అతనలా చెయ్యడంలో ఆమెకి అరికాలిమంట నెత్తికెక్కింది.

"ఏమిటి న్యూసెన్స్... కామన్ సెన్స్ లేకుండా..." మనసులోనే అనుకుంది.. అప్పటికే ఆమె ముఖం కోపంతో ఎర్రబడింది.

ఆ భావాల్ని ఎదురుగా ఉన్న కుర్రాళ్లిద్దరూ చాలా సునాయాసంగా గ్రహించగలిగారు. అందుకే పెదవి విప్పాడు మొదటి కుర్రాడు...

"అది కాదాంటీ.. మరేమో మేం బ్రహ్మచారి గాళ్లం కదా! అందుకని ఎవరూ రూము ఇవ్వనంటున్నారు. ఇంకేమో మీ ఇల్లు బావుంది, అదీకాక ఆడపిల్ల లెవరూ ఉన్నట్లు లేరు. అందుకే మిమ్మల్ని అడగాలని నిర్ణయించుకున్నాం" గబగబా.. సంజాయిషీ ఇస్తున్నట్టుగా చెప్పాడు.

అతనలా అమాయకంగా హడావుడిగా చెప్తుంటే, వింటున్న జయంతిలో కోపం స్థానే మరేదో భావం చోటు చేసుకుంది.

"అవునాంటీ.. దాదాపు వారం రోజులనుంచీ ఈ ఇంటి ముందు తిరుగుతూ ఇంటి గురించి స్టడీ చేస్తున్నాం. ముఖ్యంగా ఈ ఇంటి ఇల్లాలయిన మిమ్మల్ని మరీనూ. చూడగా మీరు చాలా మంచి వారులా అనిపించారు. అందుకే... మీ కాళ్లమీద పడయినా సరే ఎలాగయినా ఓ రూం సంపాదించాలని నిశ్చయించుకున్నాం !" చేతులు తిప్పుతూ చెప్పాడు రెండో కుర్రాడు.

అతనలా తనని పొగిడేస్తుంటే.. జయంతికి ఎందుకో నవ్వొచ్చింది. కానీ నవ్వితే బావుండదని కంట్రోల్ చేసుకుంది.

"వీళ్లెవరో కానీ... అసాధ్యుల్లా ఉన్నారు. వారం కాదు... ఇంకా ఎక్కువ రోజులనుంచే తనని గమనిస్తూ ఉండి ఉండాలి. అంతా బాగానే ఉంది కానీ కొంప దీసి వీళ్ళు దొంగలు కానీ కాదు కదా!" మనసులోనే అనుకుంది.

ఇద్దరినీ ఓసారి తేరి పారి చూసింది. మొహాల్లో పసితనం ఇంకాపోలేదు. అమాయకత్వం, హడావుడీ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. చూస్తుంటే వాళ్ళు అమాయక చక్రవర్తులే తప్ప దొంగలు కారనిపించింది.

జయంతి ఆలోచనల్లో పడి మౌనంగా ఉండిపోవడం, వచ్చిన ఇద్దరికీ మంచి అవకాశంలా అనిపించింది. మొదటి కుర్రాడు మళ్లీ అందుకున్నాడు.

"అది కాదాంటీ.. మేమేమో చదువుల కోసం ఈ ఊరొచ్చాం ! కానీ బ్రహ్మాచార్లకి ఇల్లివ్వడం లేదాంటీ... అసలు నాకు తెలీకడుగుతాను. చదువు పూర్తయ్యాకా పెళ్లి చేసుకుంటారు గానీ పెళ్లి చేసుకొని చదువుకుంటా రటండీ మన పిచ్చి కాకపోతే ! వివాహం విద్యానాశాయ అన్న శాస్త్రం ఊరికే పుట్టలేదు కదా ! ఏవిటో ఇక్కడేమో చదువు మాటెలా ఉన్నా పెళ్లి చేసుకుంటే గాని ఇల్లివ్వ నన్నట్టుగా మాట్లాడుతారందరూను. ఆమాటకొస్తే బాచుల ర్ ఆఫ్ ఆర్ట్స్... బాచులర్ ఆఫ్ కామర్స్ అంటూ ఎందుకు పెట్టారండీ ! బాచులర్స్ చదువుకోడానికే కదా! ఏవిటో లోకం తీరు మనకి అస్సలు అంతు పట్టదనుకోండి!" నిట్టూరుస్తూ ఆరిందాలా అన్నాడు.

అతని వాదనకి అప్రయత్నంగా ఆమె పెదవుల మీద చిరునవ్వు మెరిసింది. ఆమెలో అంతవరకూ ఆ ఇద్దరి మీదా ఉన్న విసుగు స్థానే ఏదో తెలియని ఆసక్తి చోటు చేసుకుంది.

"ఇంతకీ మీరిద్దరూ ఏం చదువుతున్నారు ?" నవ్వుతూ అడిగింది.

"బాచులర్ ఆఫ్ సైన్స్" ముక్తకంఠంతో జవాబిచ్చారు.

ఆ మాటకి జయంతికి ఎందుకో ఆపుకోలేనంత నవ్వొచ్చింది. పకపకా నవ్వేసింది. ఆమె అలా నవ్వుతుంటే ఆ ఇద్దరికీ ప్రాణం తేలిక పడింది.

"ఇంతకీ మీకు రూమ్ కావాలంటారు." నవ్వటం ఆపి అడిగింది.

అవునన్నట్టు తలూపారిద్దరూ.

"సరే.... అంకుల్‌తో మాట్లాడి ఏ విషయం చెబుతాను. రేపురండి" మృదువుగా అంది.

ఆ ఇద్దరి ముఖాలూ ఆమె మాటలకి క్షణంలో చిన్నబోయాయి. అది గమనించి జయంతి మనసు కలుక్కుమంది.

"దేనికయినా ప్రాప్తం ఉండాలి." మనసులో అనుకుంటున్నట్టుగా పైకే అనేశాడు రెండో కుర్రాడు.

మొదటి అబ్బాయికయితే అసలు నోటమాటే రానట్టుగా, తలొంచుకుని దిగాలుగా బయటికి నడిచాడు.

వాళ్లిద్దర్నీ అలా చూస్తుంటే జయంతి మనసు విలవిల్లాడి పోయింది.

నిజానికి ఆ ఇంట్లో సర్వాధికారాలూ ఆమెవే. ఆమె కోరికల్లో దేనినీ భర్త కాదనడు. కానీ ఆమె ఇల్లు పరాయి వాళ్లకి అద్దికిచ్చేంత వీలుగా లేదు. ఓ పెద్ద హాలు, డ్రాయింగ్ రూం, గెస్ట్‌రూం, బెడ్ రూం, కిచెన్, అప్ స్టైయిర్స్‌లో తమ పర్సనల్ రూం. అంతే!

అయితే ఆ ఇద్దరూ గలగలా మాట్లాడుతూ ఉన్న అయిదు నిమషాల్లోనే జయంతిని బాగా ఆకట్టుకున్నారు. వెడుతూ వాళ్ల ముఖాల్లో కదిలిన బాధ కూడా ఆమె మనసుని పట్టేసింది. ఎంత మర్చిపోదామనుకున్నా జాలిగా, దిగాలుగా,..... అర్థిస్తున్నట్టుగా ఉన్నవాళ్లమాటలూ.... ముఖాలే ఆమెకి పదే పదే గుర్తురాసాగాయి.

ఆలోచిస్తుంటే... ఎందుకో వాళ్లని తనకళ్ల ముందే ఉంచుకోవాలన్న బలమైన కోరిక అంతకంతకీ ఆమెలో పెరగసాగింది.

మనసులో కోరికయితే ఉంది కానీ దాన్ని తీర్చుకునే మార్గమే కనిపించలేదు.


ఆ రాత్రి ఆలోచనలతో జయంతికి నిద్రపట్టలేదు.

ఇక నిద్ర పట్టదని కూడా తెలుసు. అందుకే లేచి కిటికీ దగ్గరకొచ్చింది. చీకట్లో తమ బిల్డింగ్ వెనుక భాగమంతా మసక మసగ్గా కనిపిస్తోంది.

ఖాళీగా ఉన్న ఆ స్థలంలో ఓ మూలగా బాదం చెట్టు... జుట్టు విరబోసుకున్న దెయ్యంలా ఉంది. ఆ పక్కనే చిన్న అవుట్ హవుస్ రెండు గదులది. ఇది వరకు అందులో వాచ్‌మెన్ ఉండేవాడు. ఇప్పుడతనికి వేరే ఇల్లు కొనివ్వడంతో వెళ్లిపోయాడు. అప్పట్నుంచీ అదలా ఖాళీగానే ఉండిపోయింది.

ఆ చీకట్లో అవుట్ హౌస్‌ని చూస్తున్న జయంతి మెదడులో ఓ ఆలోచన మెరుపులా మెరిసింది. ఆ ఆలోచన వచ్చిన తర్వాత ఆమె మనసు తేలిక పడింది. హాయిగా నిట్టూర్చి వెళ్లి మంచం మీద వాలిన ఆమె క్షణాల్లో నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారింది.




అవుట్ హవుస్ విషయం భర్తకి చెప్పి అతని అనుమతి తీసుకుంది. అతన్ని ఆఫీస్‌కి పంపించేసి బాల్కనీలో కుర్చీ వేసుకుని చేత్తో పుస్తకం పట్టుకుని కూర్చుంది. పుస్తకంలో పేజీలు తిరుగుతున్నా ఆమె దృష్టంతా రోడ్డు మీదనే ఉంది. ఆ కుర్రాళ్ల గురించే జయంతి ఆత్రంగా ఎదురు చూస్తోంది.

ఓ పక్క వాళ్లొస్తే బావుండునన్న ఆశ! మరో పక్క అసలటు వస్తారో రారోనన్న అనుమానం!

ఆ రెండు భావాల మధ్య ఆమె మనసు డోలాయమానంగా ఉండగానే వచ్చారిద్దరూ! అదే రోడ్‌లో.... ఆశగా ఇరువైపులా ఉన్న ఇళ్లకేసి చూసుకుంటూ దిగాలుగా నడుస్తున్నారు.

వాళ్లు కనిపించగానే జయంతి కళ్లు మెరిశాయి.

ఇక ఒక్క క్షణం ఆగలేదు. తను కిందకి దిగి వెళ్లేలోపు వాళ్లు కనుమరుగవుతారేమోనన్న భయంతో... అక్కణ్ణుంచే చప్పట్లు చరిచింది. ఆ శబ్దానికి ఇద్దరూ తలలు పైకెత్తి చూశారు. వాళ్లని లోపలికి రమ్మనట్టుగా సైగ చేసి, తను గబగబా కిందకి దిగి వెళ్లింది.

"రండి" గుమ్మంలో నిలబడిపోయిన ఇద్దరినీ సాదరంగా ఆహ్వానించింది.

కాఫీ తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది. అది చాలదన్నట్టు ఫ్రిజ్‌లోంచి పళ్ళూ,ఐస్ క్రీం తీసి వాళ్ల ముందుంచింది. అంతలోనే ఏదో గుర్తొచ్చినదానిలా వంటింట్లోకి పరుగెత్తి అంతకు ముందు రోజు భర్త తెచ్చిన స్వీట్స్ రెండు ప్లేట్స్‌లో సర్దుకొచ్చింది.

అవన్నీ చూసిన ఆ ఇద్దరికీ ఆశ్చర్యం ముంచు కొచ్చింది.

"ఏవిటాంటీ ఇవన్నీ? కడుపునిండా పెట్టేసి అప్పుడు రూమ్ లేదని చెబుతారాఏవిటి కొంపదీసి!" ఖంగారుగా అడిగాడు మొదటి కుర్రాడు.

అతని అనుమానానికి జయంతికి నవ్వొచ్చింది.

"కాదు... రూమ్ ఉందని చెప్పడానికే ఇవన్నీ" నవ్వుతూ అంది.

ఆ మాటకి ఇద్దరూ ఎగిరి గంతేసినంత పని చేశారు.

"అది సరే... అద్దెంత ఆంటీ?" రెండో కుర్రాడు అడిగాడు.

"మీ హడావిడంత" చెప్పి నవ్వేసింది జయంతి.

ఆ మాటలో జయంతి డబ్బు కోసం రూమ్ తమకివ్వట్లేదని వాళ్లకి అర్థమైంది. ఇద్దరి కళ్లూ ఆమె పట్ల కృతజ్ఞతతో మెరిశాయి.

"థాంక్యూ ఆంటీ" కోరస్‌గా అన్నారు.

"మీ ఋణం మీ ఇంట్లోకొచ్చిన తర్వాత తీర్చు కోవడానికి ప్రయత్నిస్తాం!" మెల్లిగా అన్నాడు మొదటి కుర్రాడు.

"ఇంతకీ మీ పేర్లేవిటీ?" అప్పుడే గుర్తొచ్చినట్టుగా అడిగింది జయంతి.

"నాపేరు ప్రశాంత్" మొదటి కుర్రాడు చెప్పాడు.

"శ్రీకాంత్ నా పేరు" రెండోవాడు అన్నాడు.

"శాంత్... కాంత్" మనసులోనే అనుకుంది జయంతి.

ఆ తర్వాత అక్కడే మరో అయిదు నిమిషాలు గడిపి ఆ మర్నాడు వస్తామని చెప్పి ఆమె దగ్గర శలవు తీసుకుని వెళ్లిపోయారు శాంత్, కాంత్.

చెప్పినట్టుగానే మర్నాడే వచ్చేశారిద్దరూ.

మెస్‌లో తినే అలవాటు లేదులా ఉంది. ఓ గోనె సంచిలో వంట సామాగ్రి అంతా ఉంది. దాన్ని నీట్‌గా కిచెన్‌లో సర్దేశారు. మిగిలిన పుస్తకాలూ, సామాన్లూ రెండో గదిలో పొందికగా ఇమిడ్చేశారు. వాళ్ల ఒద్దికకు జయంతికి ముచ్చట కలిగించింది.

సహజంగానే ఇద్దరూ చురుకైన వాళ్లు కావడంతో జయంతితో ఇట్టే కలిసిపోయారు. ఆమెకి కూరలు తెచ్చి ఇవ్వడం, పని కాకపోతే కూరలు తరిగి ఇవ్వడం,... బజారు నుంచి సరుకులు తెచ్చి ఇవ్వడం, లైబ్రరీ నుంచి బుక్స్ తేవడం.... ఒకటేవిటి? అన్ని పన్లూ తమ భుజాల మీద వేసుకున్నారు.

జయంతికి కూడా వాళ్లంటే ఇదీ అని చెప్పలేని అభిమానం ఏర్పడింది. అనుక్షణం 'ఆంటీ... ఆంటీ' అంటూ వాళ్లు తన చుట్టూ తిరుగుతుంటే తనకి పిల్లలు లేరన్న విషయాన్ని ఆమె మర్చిపోయింది.

బజారు నుంచి ఆమెక్కావలసినవి తెచ్చి పెట్టడం వాళ్లవంతయితే, వాళ్లకి సమయానికి వండి పెట్టి కొసరి కొసరి తినిపించి ఇద్దరూ సరిగ్గా చదివేలా చూడడం జయంతి డ్యూటీ అయింది.

కాంత్, శాంత్‌ల హడావిడిలో రోజులు ఎలా గడిచి పోతున్నాయో కూడా జయంతికి గుర్తు లేకుండా పోయింది.

ఇంతలో ఒక రోజు.....

చిన్న కొడుకు ఇంటికంటూ వెళ్లిన జయంతి అత్తగారు తిరిగొచ్చింది.

గుమ్మంలో అడుగు పెడుతూనే ఇంట్లో తిరుగుతున్న ఇద్దరు కుర్రాళ్లనీ చూసి ఆశ్చర్యపోయింది.

వాళ్లు అవుట్‌హవుస్‌లో ఉంటున్నారని తెలుసుకుని.... "ఇప్పుడాఇల్లు అద్దెకివ్వాల్సిన అవసరం ఏవొచ్చిందీ? ఏం లేదా? పోదా!" అంటూ దీర్ఘం తీసింది.

"అయినా.... ఆ ఇచ్చేదేదో మొగుడూ పెళ్లాలకివ్వక ఇలాంటి బ్రహ్మచార్లకా ఇవ్వడం?" అంటూ జయంతిని దెప్పి పొడిచింది.

దేన్నీ జయంతి పట్టించుకోలేదు. అత్తగారు వచ్చింది కదావి శాంత్, కాంత్‌ల రాకపోకలకి అభ్యంతరం చెప్పలేదు. రోజులు గడిచిపోతున్నాయి.

శాంత్, కాంత్‌ల చనువు ముసలావిడకి మింగుడు పడలేదు. ఆ కుర్రాళ్లతో తన కోడలు చనువుగా ఉండడం ఆవిడ కసలు నచ్చలేదు.

"మీసాలైనా సరిగ్గారాని కుర్రకుంకలతో దీనికేవిటీ సరసాలు? పోయే కాలంకాకపోతే!" అనుకుంది.

ఆ విధంగా వాళ్ల బంధాన్ని తను అపార్థం చేసుకోవడమే కాదు,... ఇంట్లో పని చేసే వాళ్లకీ, ఇరుగు పొరుగులకీ, పరిచయస్థులకీ కూడా చాటింపు వేసింది. ఎవరు ఏమనుకున్నా జయంతి ప్రవర్తనలో ఎలాంటి మార్పూ రాలేదు.

అయితే... అందరూ తలో మాటా అనుకుంటున్న సంగతి జయంతికంటే ముందుగా శాంత్, కాంత్‌లిద్దరికీ తెలిసింది. తమ మూలంగా ఆమెకి మచ్చ రావడం వాళ్లు సహించలేకపోయారు. అందుకే... వెంటనే ఇల్లు ఖాళీ చేసెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఆ మాటే.... ఆ సాయంత్రం చెప్పలేక చెప్పలేక చెప్పారు.

"ఇంత హఠాత్తుగా ఎందుకీ నిర్ణయం తీసుకున్నారు?' అంతా విన్న జయంతి ఆశ్చర్యంగా అడిగింది.

"కారణం అంటూ ప్రత్యేకంగా ఏమీలేదాంటీ!" తేలిగ్గా అబద్ధం చెప్పేశాడు ప్రశాంత్.

"ఊరికే... బాదం చెట్టు మీద దెయ్యాలుంటాయని ఎవరో అన్నారు... అందుకే భయం వేసి...." మధ్యలో నీళ్లు నమిలాడు శ్రీకాంత్.

ఒక్కసారి ఇద్దరి ముఖాల్లోకి తేరపారి చూసింది జయంతి. ఏదో చెప్పలేని బాధని బలవంతంగా అణచుకుంటూన్నారిద్దరూను.

"అసలు కారణం నేను చెప్పనా!" హఠాత్తుగా అంది.

ఉలిక్కిపడి ఆమె ముఖంలోకి చూశారిద్దరూ.

"ఎందుకంత భయం? ఉన్న మాటకి ఉలుకెందుకూ? వినండి.... మన బంధం అందరికీ అపార్థం అయింది. అది తెలిసి, నా మీద ఏనిందా పడకూడదని మీరు ఇల్లు ఖాళీ చేస్తున్నారు. అంతే కదా!" తాపీగా అడిగింది.

ఇద్దరికీ నోటమాట రాలేదు. అసలా విషయం జయంతి కెలా తెలిసిందో వాళ్లకి అర్థం కాలేదు.

ఆ ఇద్దరి మనసు గ్రహించినట్టుగా అంది జయంతి.

"నాకు తెలుసు ఎప్పుడో ఇలాంటి సందర్భం ఒకటి వస్తుందని. ఆనాడే నేను జాగ్రత్తపడి ఉండాల్సింది. కానీ సంస్కారం, మంచితనంలేని ఈ లోకం కళ్లుండీ గుడ్డిదని, అది ఏ బంధాన్నయినా ఇట్టే అపార్థం చేసుకుంటుందనీ, నాకు ఇప్పుడే తెలిసింది. అందుకే నేనో నిర్ణయానికి వచ్చాను...." చెప్పడం ఆపి వాళ్ల వైపు చూసింది.

ఆమె ఆజ్ఞ ఏదయినా సరే శిరసావహిస్తామన్నట్టుగా తలలు వంచుకుని నిలబడ్డారు శాంత్, కాంత్‌లు. అది చూసి మళ్ళీ కొనసాగించింది....

"ఇక నుంచీ మీరు నన్ను 'ఆంటీ' అని కాదు! అచ్చ తెలుగులో 'అమ్మా' అని పిలవండి!" మెల్లిగా అంది.

అలా అంటూంటే ఆమె స్వరం ఎందుకో తెలియని ఉద్వేగంతో వణికింది. ఆ మాటలకి చటుక్కున తలలెత్తి ఆశ్చర్యంగా చూశారిద్దరూ!

"ఇదా మీ నిర్ణయం?" అన్నట్టుగా ఉందా చూపు.

"అవున్రా!.... ఇదే నా నిర్ణయం. నాకు... నాకు పిల్లల్లేరు. ఇక పుట్టరు కూడా. అద్దె కొచ్చిన మీలోనే ఎదిగొచ్చిన కొడుకుల్ని చూసుకుని ఆనందిస్తున్నాను. దాంతోనే తృప్తిపడుతున్నాను. ఇప్పుడీ ఆనందాన్ని దూరం చేసుకోవడం నావల్ల కాదు. అందుకే... అందుకే మీరెక్కడికీ వెళ్లొద్దు. దయ చేసి ఇక్కడే ఉండండి. ఈ.... అమ్మ మాట కాదనకండి... ప్లీజ్!...." అర్థింపుగా అంటూంటే... ఆమెకి దుఃఖం పొంగుకొచ్చింది.

ఇక తట్టుకోలేక ఏడుస్తూ చటుక్కున సోఫాలో కూలబడిపోయింది జయంతి. ఏడుస్తున్న ఆమెని ఎలా ఓదార్చాలో వాళ్లకి అర్థం కాలేదు. అయోమయంగా ముఖాలు చూసుకున్నారు.

ఆమె అలా ఎంతసేపు ఏడ్చిందో గుర్తు లేదు. కాస్సేటికి తెప్పరిల్లి, తలెత్తి చూసేసరికి ఎదురుగా ఇద్దరూ లేరు. ఎందుకో జయంతికి మళ్లీ ఏడుపొచ్చింది. ఏడుస్తూ అలాగే సోఫాలోకి జారిపోయింది.

* * *

ఎవరో కుదిపినట్టయితే ఉలిక్కిపడి కళ్లు తెరిచింది జయంతి. అప్పటికే వాల్‌క్లాక్ 'ఏడు' చూపిస్తోంది. కళ్లు నులుముకుని పక్కలకి దృష్టి సారించింది.

అక్కడ..... కాఫీ కప్పుతో ప్రశాంత్, ఆ పక్కనే టూత్ పేస్టూ, బ్రష్షుతో శ్రీకాంత్ నిలబడి ఉన్నారు. ఏమీ అర్థం కాక ఆ ఇద్దర్నీ అయోమయంగా చూసింది.

"అమ్మా!.... కాఫీ" కళ్లు తెరిచిన జయంతితో అన్నాడు ప్రశాంత్.

"అమ్మా! పేస్టూ... బ్రష్షూ...." చెప్పాడు శ్రీకాంత్.

"కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకులు. బంధం ఇలా ఎన్నాళ్లో!" అనుకుంటూంటే జయంతి కళ్లలో మళ్లీనీళ్లు నిండుకున్నాయి. అవి.. ఆనందబాష్పాలు.



## ఫరె ఛేంజ్

"ఏమిటిలా వచ్చారూ?"

"జెస్ట్ ఫరె ఛేంజ్?"

"ఏమిటీ చిల్లర కోసం మీరు ఈ ఊరు వచ్చారా? మీ ఊర్లో చిల్లరకి అంత ఇబ్బందిగా ఉందన్న మాట!"

**పి. సరోజ** (అమలాపురం)